క్లుప్తంగా

అప్పారావుకు దేవన్‌రెడ్డి పరామర్శ



మద్దాల అప్పారావును పరామర్శిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాల అప్పారావును ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల శస్త్ర చేయించుకున్న మద్దాల అప్పారావు ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, నాయకులు జీలకర్ర నాగేంద్ర, నాగిశెట్టి శ్రీను ఉన్నారు.

29 నుంచి కబడ్డీ టోర్నీ

అగనంపూడి: వరసిద్ధి వినాయక మహోత్సవాలను పురస్కరించుకొని ఉత్తరాంధ్ర స్థాయి పురుషుల కబడ్డీ టోర్నమెంట్ ఈనెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్టు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పి.కోటేశ్వరరావు తెలిపారు. 85వ వార్డు లంకెలపాలెం కూడలిలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, పది వేలు నగదు పారితోషికం అందివ్వనున్నట్టు వారు పేర్కొన్నారు. ఆర్‌బీఆర్ యూత్, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించనున్న ఈ పోటీలు ప్రతీరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వివరాల కోసం 76800 05666, 98856 98717 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తప్పిపోయిన యువతి తల్లిదండ్రుల చెంతకు

కూరమన్నపాలెం: ఇంటి నుంచి వెళ్లిపోయిన మతిస్థిమితంలేని యువతి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించామని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు. వివరాలు.. 86వ వార్డు రాజీవ్‌నగర్‌కు చెందిన వద్దే అరుణకుమారి(19) అనే యువతి ఇంటి నుంచి ఈ నెల 23 రాత్రి తప్పి పోయిందని ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చేపట్టామన్నారు. ఐదు గంటల్లోనే ఆమె ఆచూకీ కనుగొని తల్లిదండ్రులు వద్దకు చేర్చామని ఆయన తెలిపారు.

పాస్టర్ శామ్యూల్‌కు నివాళి



శామ్యూల్ పార్థివ దేహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ నాయకుడు, పాస్టర్ శామ్యూల్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పెదగంట్యాడకు చెందిన పాస్టర్ శామ్యూల్ సోమవారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, సంపంగి ఈశ్వరరావు, పిట్టా రెడ్డి, గంట్యాడ గురుమూర్తి తదితరులు నివాళులర్పించారు.

కిడ్నీ బాధిత విద్యార్థికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న విద్యార్థి పైలా జస్వంత్‌కు గాజువాక లయన్స్ క్లబ్ ఆర్థిక సహాయం అందజేసింది. లయన్స్ క్లబ్ ద్వారా సమకూర్చిన రూ.20 వేల చెక్కును సోమవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ద్వారా బాధితుడి తల్లికి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, స్థానిక నాయకులు నున్న శ్రీనివాసరావు, అచ్యుతరావు, బండారు సత్యారావు, గోవిందరాజు, బలివాడ సత్యారావు, నల్లూరు సూర్యనారాయణ, జె.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులు లేక ఇంటికే పరిమితమైన ఆటోలు

ఆటోవాలా డీలా

స్త్రీ శక్తి పథకం.. ఆటో డ్రైవర్లకు శాపంగా మారింది.. వారి ఆదాయానికి గండి కొట్టింది.. ఆర్థిక ఇబ్బందుల్లో పడేసింది.. ఆటో డ్రైవర్లను రోడ్డుపైకి నెట్టేసింది.. అయినా కూటమి ప్రభుత్వం ఎటువంటి భరోసా ఇవ్వడం లేదని వారంతా లబోదిబోమంటున్నారు. కుటుంబాలను ఎలా నెట్టుకురావాలంటూ వాపోతున్నారు.
– పెదగంట్యాడ

- ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లకు అవస్థలు
- భరోసా ఇవ్వని కూటమి ప్రభుత్వం
- కుటుంబాలను ఎలా పోషించాలని ఆవేదన



ఉచిత బస్సు ఎక్కుతున్న మహిళలు



వుడాకాలనీలో ప్రయాణికుల కోసం రోడ్డు పక్కన నిలిపిన ఆటోలు

కూటమి ప్రభుత్వం ఈ నెల 15 నుంచి అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి పథకం) పథకం ఆటో డ్రైవర్ల జీవితాలను తలకిందలు చేసింది. ప్రత్యామ్నాయం చూపకుండా ఈ పథకాన్ని అమలు చేయడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిరక్షరాస్యత కారణంగా కొందరు.. నిరుద్యోగ సమస్య కారణంగా మరికొందరు ఆటోలు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే మహిళలు అధిక శాతం ఆటో ప్రయాణికులు కావడంతో స్త్రీ శక్తి పథకంతో తమ జీవితాలు అతలాకుతలం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు ప్రాంతాలకు సంబంధించి సుమారు 16 బస్సులు తిరుగుతున్నాయి. గంగవరం, దయాల్‌నగర్, సీతానగరం, సమతానగర్, నడుపూరు, హౌసింగ్‌బోర్డు కాలనీ, పెదగంట్యాడ కూడలి, అప్పికొండ, వడీనాబాగ్, నమ్మిదొడ్డి, ఇలా తదితర ప్రాంతాల్లో సుమారు 380 వరకూ ఆటోలు ఉన్నాయి. దాదాపు 450 కుటుంబాల వరకూ వీటిపై ఆధారపడి జీవిస్తున్నాయి.

స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన కూటమి ప్రభుత్వం మాత్రం ఆటోడ్రైవర్లకు మొండి చేయి చూపించింది. ఎన్నికల ముందు ఆటోవాలాలకు రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించి గెలిచిన తరువాత దాని ఊసే ఎత్తడంలేదని ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తగ్గిపోయిన ఆదాయం

ప్రతి రోజూ రూ.500 నుంచి రూ.1000 వరకూ సంపాదించే ఆటోడ్రైవర్లకు ఇప్పుడు రోజుకు రూ.300 కూడా లభించడం లేదు. మరోవైపు ఆటోల మరమ్మతులు, ఇన్సూరెన్స్, పర్మిట్లు, ట్యాక్సులు, పెట్రోల్, డీజిల్ ఖర్చులను భరించలేకపోతున్నారు. కుటుంబ పోషణ కష్టంగా మారడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు.

గత వైఎస్సార్ సీపీ హయాంలో భరోసా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహన మిత్ర పథకం కింద ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేల వంతు ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింతగా ఆదుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 15 కావస్తున్నా ఎలాంటి భరోసా లభించడం లేదని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లతో పాటు మెకానిక్‌లు, సీట్ కవర్ వర్కర్లు, స్టిక్కర్ కార్మికులు వంటి అనుబంధ రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

ట్యాక్స్, ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలి



స్త్రీ శక్తి పథకంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధి తీవ్రంగా దెబ్బ తింది. పూర్తి ఆదాయం తగ్గిపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ఆటో నిర్వహణ కూడా భారమవుతోంది. రోడ్డు ట్యాక్స్, ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలి. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి.
–కె అప్పలరాజు ఆటోడ్రైవర్ , పెదగంట్యాడ

కుటుంబ పోషణ కష్టమైంది



నిరుద్యోగం కారణంగా అప్పులు చేసి ఆటోకొని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రతి రోజూ వచ్చే ఆదాయం ఆటో రిపేర్లకు, నిర్వహణకు సరిపోతోంది. దీని కారణంగా కుటుంబ పోషణ కష్టమైంది. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పథకం కారణంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రయాణికులు లేక ఆటోలన్నీ స్టాండ్‌లోనే ఉండిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.
–వి. రమేష్ యాదవ్, ఆటోడ్రైవర్ , సీరవానిపాలెం

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తామన్న హామీ అమలు కాలేదు.. ఆటోవాలాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉపాధి కోల్పోతున్న ఆటోవాలాలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది. డ్రైవర్లకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి.
– జి. అప్పలరాజు, ఆటోడ్రైవర్, సీకువానిపాలెం

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సి ఉంది. ఆటోల్లో అధిక శాతం మంది మహిళలే ప్రయాణిస్తూ ఉంటారు. ఈ పథకంతో మహిళలు బస్సుల్లోనే ప్రయాణాలు సాగిస్తున్నారు.
– పీత శ్రీను ఆటోడ్రైవర్, నడుపూరు

మా శ్వాస ఆగకముందే న్యాయం చేయండి

ఉక్కు వీవీవీ ఉపాధ్యాయుల ఆవేదన



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం: తమ చివరి శ్వాస ఆగకముందే న్యాయం చేయాలని ఉక్కు విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)ఉపాధ్యాయులు వేడుకున్నారు. ఈ ఏడాది పాఠశాల కొనసాగించడానికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అంగీకరించక పోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రోడ్డున పడ్డారు. సోమవారం పాఠశాల వద్దకు చేరుకున్న ఉపాధ్యాయులు విమల విద్యాలయాన్ని రక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 2016 నుంచి పాఠశాలను మూసివేయడానికి వ్యూహాత్మకంగా ప్రణాళికలు వేశారన్నారు. దీనిలో భాగంగా డీఏ హెచ్‌ఆర్, ఐఆర్, 11వ పీఆర్సీ నిలిపివేశారన్నారు. పెండింగ్ జీతాలు చెల్లించి, పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని లేనిపక్షంలో పోర్ట్ ట్రస్ట్ మాదిరిగా తమను స్టీల్‌ప్లాంట్‌లో నాన్ టెక్నికల్ ఉద్యోగులుగా చేర్చుకోవాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. సత్యనారాయణ, అనిత,సత్యం, మధుసూదన్, రామకృష్ణ, శ్రీనివాస్, సత్యవతి, జ్యోతి, మణి, రెజీనా, సుధ, శోభ, జయ, శేషమణి, మేరిసుగుణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ఈఈతో చర్చిస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డు పరిధిలోని ద్రోణంరాజు కల్యాణ మండపం నుంచి దుర్గాదేవి గుడి వరకు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు (చందు) సోమవారం పరిశీలించారు. గాజువాక జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాయల్‌బాబుతో కలిసి పరిశీలించిన ఆయన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం చందు మాట్లాడుతూ వార్డులోని అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. వార్డులోని అభివృద్ధి పనుల్లో ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శివ, కాలనీ పెద్దలు రాజారావు, సీతిన అప్పారావు, కె.ఎస్.నాయుడు, బాబులునాయుడు, అంజిబాబు, పల్లా రమణ, దొరబాబు, నాని, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి న్యాయం చేయాలని ఆందోళన



ఆందోళనకారులకు సర్ది చెబుతున్న పోలీసులు

కూర్మన్నపాలెం: విధి నిర్వహణలో గాయపడిన వ్యక్తిని యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపిస్తూ షాహువాలా సిలెండరీ కంపెనీ ముందు సోమవారం పకీర్ తక్యావాసులు ఆందోళనకు దిగారు. గ్రామంలోని మహిళలు, యువకులు ఉదయాన్నే సంస్థ గేటు ముందుకు చేరుకొని బైఠాయించారు. గేట్లు మూయించేశారు.ఆందోళన కారులకు వైఎస్సార్ సీపీ నాయకులు మద్దతు తెలిపారు. అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకోవడంతో చివరకు పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాల వారిని చర్చలు జరిపేందుకు అవకాశం కల్పించారు.

ఇదీ విషయం

పకీర్‌తక్యాకు చెందిన రహమత్ అలీ(21) రెండు నెలల కిందట షాహూవాలా కంపెనీకి పనికి వెళ్లాడు. షీలింగ్ వర్కు చేస్తుండగా అలీ కింద పడిపోయాడు. దీంతో రెండు కాళ్లు, వెన్నుముఖ, పక్కటెముకలు పూర్తిగా విరిగి పోయాయి. అప్పట్లో సంస్థ యాజమాన్యం అలీ వైద్య ఖర్చులు భరించడానికి అంగీకరించింది. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఆయన మంచానికే పరిమితమయ్యాడు. వృద్ధులైన తల్లిదండ్రులు ఏమి చేయాలో తోచక గ్రామస్తులను, పెద్దలను ఆశ్రయించారు. దీంతో వారికి అండగా 86వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు చేగొండి శ్రీనివాసరావు, భూపతిరాజు శ్రీనివాసరాజు, మాడశ కనకరాజు తదితరులు గ్రామస్తులతో కలిసి అలీ కుటుంబానికి మద్దతుగా ఆందోళన చేపట్టారు. చిన్న వయస్సులోనే మంచం పట్టిన అలీకి మెరుగైన వైద్యం అందించాలని, తల్లిదండ్రులకు జీవనం కోసం కొంత మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు, ఎస్.ఐ శ్రీనివాసరావు వచ్చి ఆందోళనను అదుపు చేశారు. ఆ తర్వాత నాయకులు, సంస్థ యాజమాన్య ప్రతినిధులు చర్చలు జరిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాతలకు సర్టిఫికెట్‌లు అందించిన అండిబోయిన లక్ష్మి, బ్రహ్మకుమారీలు

పెదగంట్యాడ: రక్తదానంపై అపోహలొద్దని డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అండిబోయిన లక్ష్మి, అండిబోయిన అప్పారావు అన్నారు. రాజయోగిని ప్రకాశమణి దాది 18వ పుణ్యస్మృతి సందర్భంగా బ్రహ్మకుమారీస్ గాజువాక ఇన్‌చార్జి మణి ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సింధు, భవాని, ప్రమీల, ట్రస్ట్ సభ్యులు శివగణేష్, వినోద్‌బాలు, నాయకులు తిప్పల నితీష్‌రెడ్డి, తిప్పల సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టిగణపతినే పూజిద్దాం



అగనంపూడిలో మట్టి వినాయక విగ్రహాలు అందిస్తున్న మేడపాటి కృష్ణారెడ్డి తదితరులు



తయారు చేసిన మట్టి వినాయకులతో విద్యార్థులు



గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అనూష తదితరులు

గాజువాక: పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరిగింది. దీనిలో భాగంగా వినాయక ఉత్సవాల్లో చాలా మంది ఎకో గణపతికే జై కొడుతున్నారు. దీనిలో భాగంగా పలు సంస్థలు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయించి భారీ స్థాయిలో పంపిణీ చేస్తున్నారు. సోమవారం పలు ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు.

– 68వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన శ్రీనివాస్, గొంతిన సత్యవతి ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష మట్టివిగ్రహాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సంద్రాన నూకరాజు, నాయకులు నేలపాటి సత్యవతి, పూడి శాంతి పాల్గొన్నారు.

అగనంపూడి: పర్యావరణ హితంగా వినాయక ఉత్సవాలు చేసుకుందామని స్వాతి ప్రమోటర్స్ అధినేత మేడపాటి కృష్ణారెడ్డి, యూఎస్ఏకు చెందిన కాజా శారద అన్నారు. వీరి సహకారంతో అగనంపూడి షిర్డీసాయి బాబా మందిరం ఆవరణలో మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, పీఎల్ఎన్‌రాజు, పి.సత్యనారాయణ, సత్యలక్ష్మి, సూరీడమ్మ పాల్గొన్నారు.

- చిత్రకళ ఉపాధ్యాయుడు ఎన్.సురేష్ సారథ్యంలో అగనంపూడి ఏబీఎస్ పాఠశాలలో విద్యార్థులు మట్టితో విగ్రహాలు తయారు చేశారు. పీ.ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో సంకటమోచన గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంత్రిశంకరనారాయణ, నాయకుడు కులుకూరి మంగరాజు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంత్రి నరసింహమూర్తి, వీవీఎస్ మూర్తి, మంత్రి గోపి, కె. సుధాకర్, రాజా, ఎండా కృష్ణ, హరినాథ్ పాల్గొన్నారు.

- బాలచెరువు కూడలిలో మట్టి గణపతి ప్రతిమలను బీజేపీవిశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పంపిణీ చేశారు. 76వ వార్డు బీజేపీ అధ్యక్షుడు జీలకర్ర రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీలకర్ర భువనేశ్వరి, డాక్టర్ హేమలత, ఎస్. అప్పలరాజు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కోమటి శ్రీనివాస్

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన మట్టి వినాయకుని ప్రతిమల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్ట్ చైర్మన్ కోమటి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పోలిశెట్టి రమణ, పాత్రో, చిన్నంనాయుడు, వెంకటేష్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



76వ వార్డులో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న శంకరనారాయణ తదితరులు

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు. అనంతరం ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

గుర్తించిన ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు



యారాడ తీరంలో సూచలిస్తున్న సీఐ కామేశ్వరరావు

పెదగంట్యాడ: వినాయకుని నిమజ్జనోత్సవాలపై న్యూపోర్టు పోలీసులు అప్రమత్తమయ్యారు. నిమజ్జనోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక దృష్టి సారించారు. అనువు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కావడంతో న్యూపోర్టు పోలీసు స్టేషన్ సీఐ కామేశ్వరరావు యారాడ తీరంలో పర్యటించారు. తీరంలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనోత్సవాలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా లైటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు.గణేష్ నిమజ్జనోత్సవాలకు వచ్చే భక్తులకు పలు సూచనలు చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు.సముద్రం లోతుగా ఉన్న ప్రాంతాల్లోకి భక్తులు వెళ్లకుండా ఉండేందుకు బారికేడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం



కృష్ణాష్టమి వేడుకల్లో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

అగనంపూడి: బీసీలకు రాజ్యాధికారం సాధించే వరకు భారత చైతన్య యువజన పార్టీ పోరాడుతూనే ఉంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ అన్నారు. 88వ వార్డు కొత్తూరు కాలనీ, వెదుళ్లనరవల్లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీసీలను ప్రధాన రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్‌గానే పరిగణిస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యాదవులపై జరుగుతున్న దాడులను తిప్పకొట్టాలని యాదవ సంఘాల నాయకులు రామచంద్ర యాదవ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గొలగాని సత్యనారాయణ, సర్వసిద్ధి బొరయ్యానాయుడు, చట్టి తాతారావు, యలమంచిలి చిన అప్పారావు, పల్లా సతీష్ పాల్గొన్నారు.